క్లుప్తంగా

ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

కొమ్మాది: విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని విడిచిపెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ సూచించారు. ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత వచ్చేలా కృషి చేయాలని కోరారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సహకారం అందించాలన్నారు. అనంతరం విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టీని పరిశీలించారు.

అనంతుని కల్యాణోత్సవాలపై సమావేశం నేడు

పద్మనాభం: పద్మనాభంలో వచ్చే నెల 9 నుంచి 15 వరకు జరగనున్న అనంతుని కల్యాణోత్సవాలపై గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు ఈవో నానాజీ బాబు ప్రకటనలో తెలిపారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి భక్తులు హాజరు కావాలని కోరారు.

సాయి సంహిత ట్రస్ట్ వార్షికోత్సవం

తగరపువలస: సాయి సంహిత ట్రస్ట్ ఐదో వార్షికోత్సవం సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు రెడ్డిపల్లి అప్పలరాజు బంగ్లామెట్ట పాఠశాలలో వంద మంది విద్యార్థులకు రొట్టెలు, చాక్లెట్లు, స్టేషనరీ పంపిణీ చేశారు. తన కుటుంబ సభ్యుల సహకారంతో ట్రస్ట్ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామన్నారు. హెచ్ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైతుల నమోదు

తగరపువలస: ఆనందపురం మండలంలోని రైతులంతా గురువారం నుంచి రైతు సేవా కేంద్రాలలో ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఏవో చావా సంధ్యా రత్నప్రభ కోరారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఐడీ కోసం ఈ రిజిస్ట్రీ ఉపయోగపడుతుందన్నారు. దీని కోసం రైతులు ఆధార్, 1బీ రికార్డు, ఆధార్‌తో అనుసంధాన ఫోన్ నంబరుతో రైతు సేవా కేంద్రాల ద్వారా ఐడీని జనరేట్ చేసుకోవాలన్నారు. ఈ ఐడీ ఉన్న వారికే ఈ నెల 28 తరువాత పీఎం కిసాన్ లబ్ధి జమ అవుతుందన్నారు. ఇకపై ఆధార్‌కు ప్రత్యామ్నాయంగా వినియోగించే ఐడీని రైతులు భద్రపరచుకోవాలని సూచించారు.

పునరావాస కేంద్రానికి మతిస్థిమితం లేని మహిళ



పీఎం పాలెం: తన గురించి వివరాలేమీ చెప్పలేకపోతున్న మహిళను పీఎం పాలెం పోలీసులు చేరదీసి, నగరంలో ఉన్న మహిళా పునరావాస కేంద్రానికి తరలించారు.సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. పరదేశిపాలెం పరిసర ప్రాంతాల్లో ఓ మహిళ (45) తిరగడం గమనించిన స్థానికులు ఆమె వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా ఆమె చెప్పలేకపోయింది. 112కు ఫోను చేయగా స్థానిక పోలీసులు బుధవారం ఆమెను నగరంలోని టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ జీవీఎంసీ హోమ్‌కు తరలించారు. ఆమె గురించి వివరాలు తెలిసిన వారు 94407 96060 నంబరుకు ఫోన్ ద్వారా సంప్రదించాలని సీఐ కోరారు.

మద్దిలో నిరంతర ఆదాయ మోడల్‌కు శ్రీకారం



మోడల్‌కు శ్రీకారం చుడుతున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

పద్మనాభం: మండలంలోని మద్దిలో ప్రకృతి వ్యవసాయ అధికారులు భూమి మీద నిరంతరం ఆదాయం వచ్చే (ఎనీటైమ్ మనీ) మోడల్‌కు బుధవారం శ్రీకారం చుట్టారు. గ్రామంలో బుగత గణేష్‌కు చెందిన 50 సెంట్ల భూమి లీజుకు తీసుకుని ఈ మోడల్‌కు నాంది పలికారు. దీనిలో భూమి లోపల పండే వేరుశనగ, ముల్లంగి, తీగ జాతికి చెందిన బీర, కాకర, ఆనప, ఆకు కూరలు, అలాగే కాయగూరలతో పాటు పండ్ల జాతులు బొప్పాయి, అరటి, ఇతర పంటలు మొక్కజొన్న, మునగ వంటి 25 రకాల పంటలు వేశారు. వీటి ద్వారా 365 రోజులు ఆదాయం వస్తుందన్నారు. ఏడాదికి రూ.4 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ ఎ.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ గ్రామంలో ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకు వెళ్లడమే గగనమైపోతోంది. రుద్రభూమి రోడ్డు అవతలే ఉన్నా.. 2 కి.మీ చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి..

ఆ గ్రామస్తులు ప్రతి రోజూ పొలం వెళ్లాలంటే రోడ్డు దాటాలి. కానీ హైవే పై రెయిలింగ్ ఉండటంతో వేములవలస వెళ్లి అండర్ పాత్ నుంచి తిరిగి రావాలంటే 2 కి.మీ ప్రయాణించాల్సిందే..

పరిశ్రమలు కూడా గ్రామం అవతలే ఉండటంతో అందులో పని చేసేవారిదీ ఇదే పరిస్థితి. ప్రతి రోజూ వెళ్లడానికి 2 కి.మీ, రావడానికి 2కి.మీ అదనంగా 4 కి.మీ ప్రయాణించాల్సిందే..





రోడ్డు దాటాలంటే 2 కి.మీ. ప్రయాణం

వెల్లంకివాసులకు హైవే వెతలు | నివాసాలు ఒకవైపు | భూములు, పరిశ్రమలు మరోవైపు | శ్మశానవాటిక కూడా అవతలివైపే.. | అసంపూర్తిగా అండర్‌పాస్‌వే | చుట్టూ తిరిగి వస్తున్న వాహనాలు

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ వాసులకు జాతీయ రహదారి కష్టాలు అధికమయ్యాయి. ముఖ్యంగా ఈ పంచాయతీ వాసులంతా జాతీయ రహదారికి ఒకవైపు ఉంటే.. వ్యవసాయ భూములు, పరిశ్రమలు ఆఖరికి శ్మశానవాటిక కూడా మరొకవైపు ఉన్నాయి. దీంతో తప్పనిసరిగా మృతదేహాలను, పశువులను ఆరులేన్ల జాతీయ రహదారి దాటించవలసి ఉంటుంది. లేదంటే వెల్లంకి నుంచి తగరపువలస మీదుగా విజయనగరం వెళ్లాలంటే ముందుగా వేములవలస వెళ్లి అండర్‌పాత్ వే నుంచి తిరిగి రావడానికి 3 కి.మీ ప్రయాణించాలి. మృతదేహాల వెంట వందలాది మంది కూడా వెళ్తుంటారు. ఇలాంటి సమయంలో రాకపోకలు సాగే వాహనాలు వేగనియంత్రణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

వెల్లంకి పంచాయితీలో నివాసాలు ఉండే వైపు చిన్నాచితక వరకు 30 వరకు పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో వందలాది మంది ఉపాధి పొందుతుంటారు అలాగే జాతీయరహదారి పొడవునా రెయిలింగ్ నిర్మాణం చేపట్టి ఉంది. దీంతో గ్రామస్తులే శ్మశానవాటికకు వెళ్లడానికి అక్కడక్కడ రెయిలింగ్‌ను కట్ చేశారు. దీంతో గ్రామస్తుల కష్టాలను చూసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండర్‌పాత్ వే నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఇందులో రూ.16 లక్షలు విలువైన పనులు పూర్తి కాగా రూ.11 లక్షల బిల్లు కూడా కాంట్రాక్టర్‌కు చెల్లించారు.



హైవే అవతల శ్మశానవాటికకు వెళ్లే దారి



వెల్లంకి గ్రామం నుంచి అండర్‌పాత్‌లోకి వెళ్తున్న మురుగు

డిజైన్‌లో లోపాలు.. నిర్మాణంలో తప్పులు



శ్మశానం వైపు అసంపూర్తి నిర్మాణంగా అండర్‌పాత్

ఈ నిర్మాణంలో హైవే అధికారుల పర్యవేక్షణ లోపం అడుగడుగునా కనిపిస్తోంది. వాస్తవానికి అండర్‌పాత్ నిర్మాణం జరిగిన ప్రదేశంతో పాటు డిజైన్‌లో కూడా లోపాలు ఉన్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదకరమైన మలుపునకు చేరువలో నిర్మాణం చేపట్టకూడదంటున్నారు. దీంతో నిర్మాణంలో ఉన్న అండర్‌పాత్ లోపలికి నేరుగా వర్షంనీటితో పాటు పంచాయతీకి చెందిన మురుగునీరు కూడా వచ్చి చేరుతోంది. ఈ కారణంగా అండర్‌పాస్ ద్వారా రాకపోకలు కష్టమేనని నిర్మాణాన్ని అసంపూర్తిగా నిలిపివేశారు. ఈ అండర్‌పాత్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో తగరపువలస వైపు వెళ్లే ద్విచక్రవాహనదారులు సింగిల్ వేలో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆటోలు, బస్సులపై వెళ్లాలనుకునేవారు రెయిలింగ్‌ను దాటవలసి వస్తుంది.

నిత్యం అవస్థలే..



జాతీయరహదారి విస్తరణ జరిగిన తర్వాత గ్రామస్తులకు రోడ్డు దాటేందుకు అవకాశం లేకుండా పోయింది. ప్రతిరోజూ చేసుకునే వ్యవసాయ పనులకు రైతులు, కూలీలు వెళ్లలేకపోతున్నారు. శాస్త్రీయ పద్ధతిలో అండర్‌పాత్ వే నిర్మిస్తే అందరి కష్టాలు తీరతాయి.

– గోలి సత్యనారాయణ, వెల్లంకి

అండర్‌పాత్ లోకి మురుగు



మా పంచాయతీ వాసులకు అండర్‌పాత్ నిర్మాణం అత్యవసరం. కానీ నిర్మాణంలో లోపాలతో పాటు నిర్మాణం చేపట్టే ప్రదేశం సరైనది కాదు. దీంతో గ్రామంలో మురుగు నీరు అంతా అండర్‌పాత్‌లో ఉంది. ఇటీవల వెల్లంకి సర్వీస్ రోడ్లపై రోజుల తరబడి మురుగు నిలిచిపోవడానికి కూడా ఇక్కడ అండర్‌పాత్ కారణం.

– కర్రి చంద్రశేఖర్, వెల్లంకి

తరచూ ప్రమాదాలు



పెద్దిపాలెం, తాళ్లవలస పంచాయతీ వాసులకు అండర్ పాస్‌లు, వేములవలస వాసులకు అండర్‌పాత్‌లు నిర్మించడంతో వారు తేలికగా జాతీయరహదారి దాటి పోగలుగుతున్నారు. ఎటొచ్చి వెల్లంకి వద్దే లోపాల కారణంగా అండర్‌పాత్ వే నిలిచిపోయింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా మృతదేహాలు దాటించాలన్నా, తగరపువలస వైపు వెళ్లాలన్నా చాలా ఇబ్బందిగా ఉంటుంది.

– డాక్టర్ కె.చంద్రమౌళి, న్యాయవాది

చిన్న శ్రీను పరామర్శ



సోషల్ మీడియా కార్యకర్త వీరుబాబుతో చిన్న శ్రీను

తగరపువలస: ఇటీవల భీమిలి మండలం అమనాం పంచాయతీకి చెందిన జీరు వీరుబాబు అనే సోషల్ మీడియా కార్యకర్త అక్రమ అరెస్ట్ సందర్భంగా బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆయనను పరామర్శించారు. తనతో పాటు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంతకు ముందు ఆయన తాళ్లవలస పంచాయతీలో గ్రామ దేవతలు గంట్రేడ శ్యామలమ్మ, బంగారమ్మలను దర్శించుకున్నారు. అనంతరం భీమిలి ఏఎంసీ మాజీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణను పరామర్శించారు. ఆయన వెంట దాట్ల పెదబాబు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, బంక సత్యం, అక్కరమాని రామునాయుడు, సరగడ రఘునాథ రెడ్డి, బోని అప్పలనాయుడు, చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

రాజీవ్‌నగర్ కొండపై ఆక్రమణలపై ఆర్డీవో ఆరా



ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్ నగర్ కొండపై జరుగుతున్న ఆక్రమణలపై ఆర్డీవో సంగీత్ మాథుర్ ఆరా తీశారు. ఈ కొండపై 60 గజాల చొప్పున స్థలాలను చదును చేయించి స్థానిక నాయకులు అమ్మకాలు చేపడుతున్న నేపథ్యంలో పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ జరుగుతున్న ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కొండపై జరుగుతున్న ఆక్రమణలు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, ఆక్రమిత స్థలానికి రక్షణ కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం ఆయన ఆదేశాల మేరకు ఇక్కడ ఆక్రమణలకు గురవుతున్న స్థలంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇక్కడ జరుగుతున్న ప్రభుత్వ స్థలాల అమ్మకాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

కలసికట్టుగా పని చేయండి



రెండో వార్డు నాయకులతో మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేసి, వచ్చే ఎన్నికలు ఏవైనా వార్డులో వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఎగరవేయాలని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కోరారు. భీమిలి మండలం మజ్జివలసలో సీనియర్ నాయకుడు దాట్ల పెదబాబు ఇంట్లో రెండో వార్డు నాయకులకు బుధవారం ఆయన దిశానిర్దేశం చేశారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే తన వద్దకు తీసుకురావాలని సూచించారు. పార్టీ ప్రతిష్టకు ఎవరూ ఇబ్బంది కలిగించకుండా మసలుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారి సమస్యలు విన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, కరుణాకరరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అక్కరమాని మంగరాజు, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, జిల్లా అఫీషియల్ స్పోక్స్‌మన్ బింగి హరికిరణ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి, సీనియర్ నాయకులు చిల్ల సూర్యనారాయణరెడ్డి, గుండాసి మధునాయుడు, పీతల వెంకట అప్పారావు, నమ్మి లక్ష్మణ, నమ్మి మాధవ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శశి విద్యార్థుల సత్తా



పాకలపాటి హర్షవర్ధన్



మీసాల హరితేజ

తగరపువలస: జేఈఈ మెయిన్స్ సెషన్స్–1 జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష ఫలితాలలో సంగివలస శశి క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. వీరిలో పాకలపాటి హర్షవర్ధన్ 99.9, మీసాల హరితేజ 99.88, బి.బాల అనిక్ 99.59, పి.శ్రావణ్ 99.52, ఆర్.మౌళి 99.45, ఎస్.నితిన్ ఆశిష్ 99.33, డి.స్టీఫెన్ 99.23, జి.తులసీరామ్ 99.18, పి.సాయిగణేష్ 99.14, జె.సుజిత్ సత్యవిష్ణుష్ 99.12 పర్సంటైల్స్ సాధించారు. 99 పర్సంటైల్స్ పైగా 13 మంది, 98కు పైగా 28, 97కు పైగా 49, 96కు పైగా 62, 95కు పైగా పర్సంటైల్స్ 76 మంది విద్యార్థులు సాధించినట్టు శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి గోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపకులను వారితో పాటు కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ అభినందించారు.

తిరుమల విద్యార్థుల ప్రభంజనం



ఎస్.ఉదయ్‌పవన్



గార వరుణ్‌కుమార్

తగరపువలస: జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్స్ పరీక్షా ఫలితాలలో భీమిలి మండలం తాళ్లవలస తిరుమల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు తెలిపారు.

వీరిలో ఎస్.ఉదయ్‌పవన్ 99.98, గార వరుణ్‌కుమార్ 99.94, బి.వేదహర్ష 99.90, కె.ఎస్.ప్రత్యూష 99.81 పర్సంటైల్స్ సాధించారు. 99.50 పర్సంటైల్స్ కంటే ఎక్కువగా 13 మంది, 99.00 కంటే ఎక్కువగా 28, 98 కంటే ఎక్కువ 64, 97 కంటే ఎక్కువ 83, 96 కంటే ఎక్కువగా 106, 95 కంటే ఎక్కువ 125, 90 కంటే ఎక్కువ 241, 80 కంటే ఎక్కువ పర్సంటైల్స్ 481 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులను రెసిడెంట్ డైరెక్టర్లు ఇ.మృత్యుంజయరావు, కె.ఎస్.వి.వి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, జి.సతీష్‌బాబుతో కలిసి చైర్మన్ అభినందించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మధురవాడ: మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ రేవళ్లపాలెం ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి. శ్రీనివాసరావు తెలిపారు. శ్రీవల్లినగర్, చంద్రంపాలెం హైస్కూల్ ఏరియా, ఎంఎస్ఆర్ లే అవుట్, భాస్కర్‌నగర్, రేవళ్లపాలెం తదితర ప్రాంతాలలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

భీమునిపట్నం: భీమిలి పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఈఈ ఆపరేషన్స్ పోలాకి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జీవీ అగ్రహారం, నిడిగట్టు, కొత్తవలస, మామిడిపాలెం, కృష్ణాకాలనీ, బిళ్లలమెట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

భీమిలి మండలంలో..

తగరపువలస: భీమిలి మండలంలో విద్యుత్ ఫీడర్ల నిర్వహణ కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా తాళ్లవలస పంచాయతీలోని తాళ్లవలస, రాయినపేట, ఎరుసుపేట, పెద్దూరు, ఒనుముపేట, లెజెండ్ క్రెస్ట్, లుంబిని, హాసిని, హార్మోని లే అవుట్లలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే బోడమెట్టపాలెం, చిప్పాడ ఫీడర్ల పరిధిలో బోడమెట్టపాలెం, ముద్దాడపేట, రామునాయుడుపేట, అల్లుపేట, రెల్లిపేట, చిప్పాడ, సిటీనగర్, జేహెచ్‌సీ, ఎన్టీఆర్ కాలనీలు, చిప్పాడ వ్యవసాయ భూములకు విద్యుత్ సరఫరా ఉండదని తెలియజేశారు.

పారదర్శకంగా రీ సర్వే

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం
- పైలట్ ప్రాజెక్ట్ గ్రామం గంధవరంలో పర్యటన

పద్మనాభం: రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మండలంలోని గంధవరంలో బుధవారం పర్యటించిన ఆయన, రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టు గ్రామమైన గంధవరంలో రైతులకు ఇబ్బంది లేకుండా రీ సర్వే చేపట్టాలన్నారు. రీ సర్వే అనంతరం గ్రామ సభ నిర్వహించి వివరాలను రైతుల ముందు ఉంచాలన్నారు. రైతుల వినతులను దృష్టిలో ఉంచుకుని వీటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. డ్రోన్, రోవర్ ద్వారా రీ సర్వేను సునిశితంగా పరిశీలించారు. రీ సర్వే, ఈ పంట నమోదు గురించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. తదుపరి రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రీ సర్వేకు సంబంధించిన వివరాలను, నివేదికలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు నివేదికలను పొందుపరచాలని సిబ్బందిని ఆదేశించారు.

సచివాలయ సేవలపై ఆరా

సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా ప్రజలకు ఏ మేరకు సేవలు అందున్నాయో ఆరా తీశారు. సచివాలయంలో పలు నివేదికలను, సిబ్బంది హాజరు పట్టీలను పరిశీలించారు. సమయపాలన పాటించి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, మరింత వేగవంతంగా సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

అనంతవరంలో ఈ పంట నమోదు తనిఖీ

అనంతరం కలెక్టర్ అనంతవరంలో పర్యటించారు. పొలాల్లో జరుగుతున్న ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. యాప్ ద్వారా లాగిన్ అయి రబీ సీజన్‌లో రైతులు వేసే పంటలను వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల నిర్వహించిన ఈ పంట నమోదును సూపర్ చెక్ చేశారు. ఈ గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. పారిశుధ్యం, పరిశుభ్రత చర్యలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఎంపీడీవో ఎం.విజయ కుమార్‌ను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. అప్పలస్వామి, తహసీల్దార్ కె.ఆనంద రావు, ఏవో ఎంపీఎస్ చలం పాల్గొన్నారు.

రైతుల వినతి : తమ గ్రామంలో గతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో డాక్యుమెంట్లు కాలిపోయినందున రీసర్వేలో భూమిపై ఉన్నవారిని పరిగణనలోకి తీసుకుని పట్టాదారు పాస్ పుస్తకాలను మంజూరు చేయాలని గంధవరం రైతులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. పూర్తి స్థాయి గ్రామ కార్యదర్శిని నియమించాలని ప్రజలు కోరారు.



గంధవరంలో రీసర్వే వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

జేఈఈ మెయిన్స్‌లో కేఎంఆర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో యాజమాన్య ప్రతినిధులు

మధురవాడ : జేఈఈ మెయిన్స్–2025 తొలి విడత ఫలితాల్లో పీఎంపాలెం దరి కేఎంఆర్ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. రౌతు షణ్ముఖేశ్వరరావు 99.68 పర్సంటైల్, సీహెచ్.ధనుంజయ నాయుడు 99.54 పర్సంటైల్, సుంకరి వైభవ్ 99.36 పర్సంటైల్ సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కేఎంఆర్ విద్యాసంస్థల డీన్స్ వై.రాంప్రసాద్, బి.అజయ్ కుమార్, డీజీఎం వై.వెంకటరమణ అభినందనలు తెలిపారు.

నాంది ఫౌండేషన్ వితరణ



స్పోర్ట్స్ కిట్లతో విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నాంది ఫౌండేషన్ స్పోర్ట్ కిట్లు అందించింది. ఎంపిక చేసిన 108 మంది విద్యార్థులకు ఫౌండేషన్ ప్రతినిధులు ఈ కిట్లను పంపిణీ చేశారు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులకు నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ భాగ్యలక్ష్మి, హెచ్ఎం మురళీమోహనరావు పాల్గొన్నారు.

బీచ్‌కు పోటెత్తిన భక్తులు

పెద్ద ఎత్తున మాఘపూర్ణిమ స్నానాలు



రుషికొండ బీచ్‌లో స్నానాలు చేస్తున్న భక్తులు

కొమ్మాది: మాఘ పూర్ణిమ సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తులతో బీచ్‌లన్నీ సందడిగా మారాయి. గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, రుషికొండ, మంగమారిపేట బీచ్‌లలో భక్తులు స్నానాలు ఆచరించి పూజలు నిర్వహించారు. రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లలో ఆరిలోవ పోలీసులు పటిష్టమైన చర్యలు ఏర్పాటు చేశారు. లైఫ్‌గార్డులు ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేశారు.

భీమిలి తీరంలో..

భీమునిపట్నం: భీమిలి తీరంలో బుధవారం జనం పెద్ద ఎత్తున మాఘ పౌర్ణమి స్నానాలను ఆచరించారు. ఉదయం ఆరు గంటల నుంచి జనం రావడం ప్రారంభించారు. గంట తర్వాత రద్దీ మరింత పెరిగింది. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. జోనల్ అధికారులు తీరంలో మహిళలు దుస్తులు మార్చుకోవడానికి టెంట్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు జనం రద్దీ కొనసాగింది.



తీరంలో స్నానాలు చేస్తున్న ప్రజలు

సరైన ప్రణాళికతో సిద్ధమైతే విజయం తథ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కస్టమ్స్ కమిషనర్ రవికిరణ్

కొమ్మాది: సరైన ప్రణాళిక రూపొందించుకుని, దాని ప్రకారం సిద్ధమైతే పరీక్షల్లో విజయం సాధించడం చాలా సులభమని కస్టమ్స్ విభాగం కమిషనర్ ఈదర రవికిరణ్ అన్నారు. సీబీఎస్ఈ 10, 12 పరీక్షలు ఈ నెలలో ప్రారంభం కానున్న నేపథ్యంలో కొమ్మాదిలోని నవోదయ విద్యాలయలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు. పరీక్షలనేవి మనం నేర్చుకున్న విషయాలు ఎంతవరకు అర్థమయ్యాయో తెలుసుకునే ప్రక్రియ అన్నారు. ఎన్ని మార్కులు వచ్చాయో అనే దానికంటే, ఎన్ని విషయాలు నేర్చుకున్నామనేది ముఖ్యం అని పేర్కొన్నారు. ముందుగా విద్యార్థులకు అడ్మిట్ కార్డులను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వైఎస్ఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.